

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
జనగామ
ఆదివారం 11 ఆగస్టు 2024



సజీవ శిల్పం

Sunday SPECIAL

కాకతీయుల నాటి కళాసంపదకు పునరుజ్జీవం





- దెబ్బతిన్న శిల్పాల ఆకృతితో సిమెంట్ విగ్రహాల తయారీ
- వారసత్వ కట్టడాల్లో 4వేలకుపైగా కళాఖండాలు.. వీటిలో 100 శిల్పాలకు జీవం
- రామప్ప, వరంగల్ కోట తదితర ప్రాంతాల నుంచి సేకరణ
- చరిత్రను భవిష్యత్ తరాలకు అందించే లక్ష్యంతో అడుగులు
- కాకతీయుల శిల్ప సౌందర్యాన్ని కాపాడే ప్రయత్నంలో చరిత్ర పరిశోధకులు
- జగదల్పూర్ రాజ్‌మహల్‌లో ఎగ్జిబిషన్ ఏర్పాటుకు ప్రయత్నాలు

7

'శిలలపై శిల్పాలు చెక్కినారు.. మనవారు సృష్టికే అందాలు తెచ్చినారు..' అని ఓ సినీ గేయ రచయిత అలనాటి తెలుగువారి శిల్ప కళా వైభవాన్ని చాటి చెప్పారు. మొక్కవోని దీక్షతో శిలను శిల్పంగా మలిచి.. ప్రపంచానికి అందించేందుకు శిల్పులు చేసిన కృషికి యునెస్కో గుర్తింపు పొందిన మన రామప్ప శిల్ప సౌందర్యమే నిదర్శనం. అంతేకాదు అనేక చరిత్రాత్మక కట్టడాలను నిర్మించిన కాకతీయుల కాలంలో శిల్పం నాట్యమాడగా.. శిల నుంచి స్వరాగాలు పలికాయట. అలాంటి అద్భుత శిలా సంపద, కళాఖండాలపై కాలక్రమంలో ప్రకృతితో పాటు దుండగులు జరిపిన దాడులతో చాలా చోట్ల ధ్వంసమైంది. రాష్ట్రంలోని ముఖ్యంగా ఓరుగల్లులోని పురాతన దేవాలయాలు, ప్రదేశాలను సందర్శిస్తే.. కొన్ని శిల్పాలు దెబ్బతిన్నట్టు.. లేదంటే వాటి అసలు ఆకృతిని కోల్పోయినట్టు అర్థమవుతుంది. అలాంటి శిల్పాల పాత రూపం చెక్కుచెదరకుండా అసలు అకృతిని ఇచ్చేందుకు చరిత్ర పరిశోధకులు శిల్పాల పునరుజ్జీవానికి శ్రీకారం చుట్టారు. చారిత్రక సంపదను యథాతథంగా ఆవిష్కరింపజేసేందుకు ప్రయత్నిస్తున్నారు.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

రేపు, ఎల్లుండి క్రీడా పోటీలు

జనగామ రూరల్, ఆగస్టు 10: స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 12, 13 తేదీల్లో క్రీడల పోటీలు నిర్వహిస్తునట్లు కలెక్టర్ రిజ్వాన్ బాషా ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో మండలస్థాయి ఉద్యోగులకు, జర్నలిస్టులకు క్రీడలు నిర్వహిస్తామని, విజేతలకు ఈ నెల 14న జనగామ మినీ స్టేడియంలో జిల్లా స్థాయి పోటీలు ఉంటాయని తెలిపారు. మహిళలకు టగ్గాఫ్ వార్, మ్యూజికల్ చైర్, 100 మీటర్ల స్పీడ్ వాకింగ్, కబడ్డీ, చెస్ పోటీలు నిర్వహిస్తామన్నారు. పురుషులకు క్రికెట్, వాలీబాల్, టగ్గాఫ్ వార్, లాంగ్ జంప్, 100 మీటర్ల పరుగు పందెం, కబడ్డీ క్రీడలను నిర్వహిస్తామని తెలిపారు.

దేవుడి గుట్టపై భక్తజన సందోహం

కొనసాగుతున్న స్వామి వారి ఉత్సవాలు



దేవుడి కొండపైకి తరలి వచ్చిన భక్త జనులు

జఫర్‌గఢ్, ఆగస్టు 10: భక్తజన ఇలవేల్పుగా ప్రసిద్ధి చెందిన శ్రీ వేల్పుగొండ లక్ష్మీనర్సింహస్వామి వారి శ్రావణమాసోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. శ్రావణమాసం మొదటి శనివారం స్వామి వారి దర్శనం కోసం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కోనేరులో పుణ్యస్నానమాచరించి శ్రీలక్ష్మీనర్సింహ స్వామిని దర్శించి మొక్కులు చెల్లించుకున్నారు. అర్చకులు పొడిచేటి సగంపాలు వెంకటాచార్యులు స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. ఆలయ ప్రాశస్త్యం, స్వామి వారి మహిమల గురించి భక్తులకు వివరించారు. కొండ దిగువన ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం జిల్లా, మండల ప్రతినిధులు సిహెచ్.కృష్ణమూర్తి, రేవూరి రమేశ్, శ్రవణ్, యుగంధర్, రాజయ్య, సోమన్న, హరిశంకర్, పూర్ణచందర్, సీతరాములు, రామయ్య, నాగరాజు, మణికాంత్, సోమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన డీసీపీ



సిబ్బందికి సూచనలిస్తున్న డీసీపీ రాజమహేంద్ర నాయక్

కొడకండ్ల, ఆగస్టు 10: మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను జనగామ డీసీపీ రాజ మహేంద్ర నాయక్ శనివారం తనిఖీ చేశారు. మొట్టమొదటిసారి మండలానికి వచ్చిన ఆయన స్టేషన్‌లో రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కేసులు పెండింగ్ లేకుండా చూసుకోవాలని, రికార్డులలో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని సూచించారు. శాంతి భద్రతల గురించి, రైడీ షీటర్ల హిస్టరీ గురించి అడిగి తెలుసుకున్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ గురించి సిబ్బందికి వివరించారు. యువకులకు, విద్యార్థులకు ఆన్‌లైన్ క్రైం గురించి, మత్తుపదార్థాల వినియోగంతో కలిగే నష్టం గురించి అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో పాలకుర్తి సీఐ మహేందర్‌రెడ్డి, కొడకండ్ల ఎస్‌ఐ శ్రవణ్‌కుమార్, ఏఎస్‌ఐ రమేశ్, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

శ్రీపతిపల్లికి అత్యధిక నిధులు వెచ్చిస్తా

ఎమ్మెల్యే కడియం శ్రీహరి



దుర్గామాత ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

చిలుపూర్, ఆగస్టు 10: తనతో పాటు, తన కుమార్తె కడియం కావ్యకు గత ఎన్నికల్లో భారీ మెజారిటీనిచ్చిన శ్రీపతిపల్లి గ్రామ సమగ్రాభివృద్ధి కోసం అత్యధిక నిధులను వెచ్చిస్తానని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. శనివారం ఆయన శ్రీపతిపల్లి గ్రామంలో విష్ణు దుర్గామాత ఆలయంలో కాంగ్రెస్ నేతలతో కలిసి పూజలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గ సంక్షేమమే ధ్యేయంగా తాను పాటుపడుతున్నానని, తన ముప్పై సంవత్సరాల రాజకీయ జీవితంలో ఎక్కడా అవనీతి, అక్రమాలకు పాల్పడలేదని అన్నారు. గ్రామాల అభివృద్ధి కోసం పార్టీలకతీతంగా అందరూ కలిసి పని చేయాలని కోరారు. అనంతరం గ్రామంలో అనారోగ్యం కారణంగా మృతిచెందిన పోలబోయిన యాదమ్మ కుటుంబాన్ని సందర్శించి ఆమె కుమారుడు కాంగ్రెస్ పార్టీ గ్రామాధ్యక్షుడు పోలబోయిన నరేష్‌ను పరామర్శించారు. అనంతరం అదే గ్రామంలో ఇటీవల మృతిచెందిన గుర్రపు రామయ్యతో పాటు, కొండాపూర్, చిన్నపెండ్యాల గ్రామాల్లో మృతిచెందిన మోతె వెంకటమ్మ, నాగపురి భాగ్యలక్ష్మి కుటుంబాలను కడియం పరామర్శించారు.

మంత్రి సురేఖను అడ్డుకున్నాననడం సరికాదు..

మొక్కులు సమర్పించేందుకు శ్రీపతిపల్లికి వస్తానన్న దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను తాను అడ్డుకుంటున్నానని ఓ బీఆర్ఎస్ నాయకుడు ఆరోపణలు చేయడం తగదని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. తనపై ఆరోపణలు చేస్తున్న వారు వారి పలుకుబడిని ఉపయోగించి గ్రామాభివృద్ధి కోసం కోట్లాది రూపాయలను మంజూరు చేయిస్తే సంతోషిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు గడ్డమీది సురేశ్, నాయకులు పోలేపల్లి రంజిత్‌రెడ్డి, బొమ్మిశెట్టి బాలరాజు, రంగు రమేష్, ఎమ్డీ షకీల్, ఎడవెళ్లి మల్లారెడ్డి, గొంగిడి కృష్ణమూర్తి, కేశిరెడ్డి కరుణాకర్‌రెడ్డి, గుగులోజు రాజు, మోతె ఉపేందర్, కావటి రాజు, బైరి సత్యనారాయణ, తిరుపతి, పల్లపు కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై బైఠాయించిన బీఆర్ఎస్ నాయకుడు..



కేశిరెడ్డి మనోజ్‌రెడ్డిని తీసుకెళ్తున్న పోలీసులు

శ్రీపతిపల్లిలో ఉన్న విష్ణుదుర్గామాత ఆలయానికి రాకుండా మంత్రి కొండా సురేఖకు ఎమ్మెల్యే కడియం అడ్డు తగులుతున్నాడని స్థానిక బీఆర్ఎస్ నాయకుడు కేశిరెడ్డి మనోజ్ రెడ్డి ఆరోపించారు. ఈ మేరకు శనివారం రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ విషయంలో ఎమ్మెల్యే కడియం సమాధానం చెప్పాలంటూ డిమాండ్ చేశారు. దీంతో గ్రామంలో కాసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. చిలుపూర్ ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్ అతడిని అదుపులోకి తీసుకున్నారు. మనోజ్‌రెడ్డితో పాటు, మరో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పాస్‌బుక్ ఆధారంగా రుణమాఫీ చేయాలి

బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంతరెడ్డి



వెల్దండలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంతరెడ్డి

నర్మెట, ఆగస్టు 10 : పట్టా పాస్‌బుక్ ఉన్న ప్రతీ రైతుకు రెండు లక్షల రుణమాఫీ చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంతరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం ఆయన వెల్దండ గ్రామంలో నిర్వహించిన రైతు రచ్చబండ కార్యక్రమంలో మాట్లాడారు. అమలుకాని హామీలిచ్చి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, తర్వాత విస్మరించిందని ఆరోపించారు. రైతులందరికీ రుణమాఫీ అయ్యేంత వరకు తాము అండగా ఉంటామన్నారు. వందలో నలభై మందికే రుణమాఫీ చేస్తూ మిగతా రైతులకు ఆంక్షల పేరుతో ఎగనామం పెట్టడం సరికాదన్నారు. రేషన్‌కార్డు ప్రామాణికంగా కాకుండా పట్టా పాస్ బుక్ ఆధారంగా రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు సమస్యలు ఉంటే బీజేపీ హెల్ప్‌లైన్ నెంబర్(9904119119)కు ఫోన్ చేయాలని కోరారు. కార్యక్రమంలో భువనగిరి పార్లమెంట్ కో కన్వీనర్ కొంతం శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శులు శివరాజ్‌యాదవ్, సౌడ రమేష్, జిల్లా కార్యదర్శి సొక్కం అనిల్, బీజేపీ మండల అధ్యక్షుడు ధరావత్‌రాజు, నాయకులు నరసింహారెడ్డి, మహిపాల్, బొల్లం అవినాష్, దళిత మోర్చా మండల అధ్యక్షుడు బుచ్చాల కొమురెల్లి తదితరులు పాల్గొన్నారు.

స్టార్టర్లకు కెపాసిటర్లు అమర్చుకోవాలి



పొలంబాటలో పాల్గొన్న జిల్లా విద్యుత్‌శాఖ అధికారులు

బచ్చన్నపేట, ఆగస్టు 10: విద్యుత్ మోటారు స్టార్టర్ల వద్ద కెపాసిటర్లు అమర్చుకోవాలని డీఈఈ లక్ష్మీనారాయణ రైతులకు సూచించారు. శనివారం ఆలీంపూర్, బచ్చన్నపేట, పోచన్నపేట గ్రామాల్లో నిర్వహించిన పొలంబాట కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతులు విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. కెపాసిటర్లు మోటర్లకు రక్షణగా ఉంటాయన్నారు. మెరుగైన సేవలు పొందేందుకు రైతులు విద్యుత్ శాఖకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఏడీఈ వేణుగోపాల్, ఏఈ రాజ్‌కుమార్, సబ్ ఇంజనీర్ అజయ్‌కుమార్, సారయ్య, జలంధర్‌రెడ్డి, రాములు, మహేశ్, మునిని రాజుగౌడ్, రాంబాబు, విలాస్, ప్రవీణ్, శ్రీకాంత్, రైతులు పాల్గొన్నారు.

చేపల వలలో కొండచిలువ

పాలకుర్తి, ఆగస్టు 10 : చేపల కోసం చెరువులో వల వేస్తే కొండచిలువ చిక్కింది. పాలకుర్తి మండలం శాతాపురం గ్రామానికి చెందిన మత్స్యకారులు రెండు రోజుల క్రితం చెరువులో చేపల కోసం వల వేశారు. శనివారం చెరువులోకి దిగి వలను తీస్తుండగా అందులో భారీ కొండచిలువ కనిపించడంతో ఆందోళన చెందారు. ఎట్టకేలకు వలను బయటికి లాగి కొండచిలువను గ్రామస్థులు కొట్టి చంపేశారు.



శాతాపురంలో జాలర్ల వలలో పడిన కొండచిలువ

వేడుకగా వెంకటేశ్వరుడి వార కల్యాణం



స్వామివారి కల్యాణం జరిపిస్తున్న పూజారులు

చిలుపూర్, ఆగస్టు 10: చిలుపూర్ గుట్ట బుగులు వెంకటేశ్వర స్వామి దేవాలయంలో స్వామివారి వార కల్యాణాన్ని శనివారం వేడుకగా నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో హాజరు కాగా, ఆలయ ప్రధాన అర్చకుడు బ్రాహ్మణపల్లి రవీందర్ శర్మ, సౌమిత్రి రంగాచార్యులు వేంకటేశ్వర స్వామి-పద్మావతి అమ్మవార్ల కల్యాణ వేడుకలను వైభవంగా జరిపించారు. అనంతరం కల్యాణంలో కూర్చున్న కుటుంబాలకు స్వామివారి శేష వస్త్రాలతో పాటు, తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ శాశ్వత దాత పొట్లపల్లి శ్రీధర్ రావు, ధర్మకర్త సంగోజు మోహనాచారి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

పార్టీ మారే ప్రసక్తే లేదు

మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



కొడకండ్లలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

కొడకండ్ల, ఆగస్టు 10 : తాను పార్టీ మారే ప్రసక్తే లేదని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు స్పష్టం చేశారు. మండలకేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన ముఖ్యనాయకులతో మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ మారుతున్నానని వస్తున్న పుకార్లు నమ్మవద్దన్నారు. కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని భరోసా ఇచ్చారు. కలిసికట్టుగా పనిచేసి పార్టీకి పూర్వవైభవం వచ్చేలా కృషి చేయాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను సోషల్‌మీడియా ద్వారా ఎప్పటికప్పుడు ఎండగట్టాలని సూచించారు. త్వరలోనే గ్రామగ్రామాన సమీక్ష సమావేశాలు పెట్టి కష్టపడే ప్రతీ కార్యకర్తకు తగిన గుర్తింపు ఇస్తూ పార్టీ బలోపేతానికి భవిష్యత్ ప్రణాళికలను రూపొందించుకుందామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు సింధె రామోజీ, పేరం రాము, చెంచు రాజిరెడ్డి, జక్కుల విజయమ్మ, డి.వెంకటేశ్వరరావు, మేటి శ్రీరాములు, మసురం వెంకట నారాయణ, ఆసిఫ్, పుష్కారి సంపత్ రావు, ప్రేం కుమార్, దేశగాని సతీష్, రణధీర్, కుంచం హరీష్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు అవుతా.. గుడుంబాను నిర్మూలిస్తా..



కొత్తగూడలో సుధీర్‌రామ్‌నాథ్ కేకన్‌తో కలిసి భోజనం చేస్తున్న చిన్నారి

మానుకోట ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్‌తో చిన్నారి

కొత్తగూడ (మహబూబాబాద్ జిల్లా), ఆగస్టు 10 : చదువుకుని పోలీసును అవుతా.. గుడుంబాను నిర్మూలిస్తానని ఓ చిన్నారి ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్‌తో తెలిపింది. దీంతో.. నీ చదువుకు పోలీసులు సహకరిస్తారని ఎస్పీ ఇచ్చారు. మహబూబాబాద్ జిల్లా కొత్తగూడలో శనివారం నిర్వహించిన గుడుంబా బాధితులకు చేయూత కార్యక్రమానికి గంగారం మండలం కోమట్లగూడెం గ్రామానికి చెందిన ఓ వితంతువు తన చిన్నారితో హాజరుకాగా.. ఎస్పీ ఆ చిన్నారితో మాట్లాడారు. పెద్దయ్యాక ఏం అవుతావని ప్రశ్నించారు. చిన్నతనంలో గుడుంబాకు బానిసై నాన్న చనిపోయాడని ఆర్థికభారంతో చదువుకోలేక పోతున్నానని, లేకుంటే చదువుకుని పోలీస్ అయ్యేదాన్ని అని ఆచిన్నారి బదులిచ్చింది. స్పందించిన ఎస్పీనువ్వు చదువుకునేందుకు పోలీసులు సహకరిస్తారని భరోసా ఇచ్చారు. తన పక్కనే కూర్చొబెట్టుకుని భోజనం చేశారు. గుడుంబాతో నాలాంటి పిల్లల చదువు దూరమై భిక్షాటన చేస్తున్నారని ఎస్పీతో చెబుతూ విలపించింది.

అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు న్యాయం చేయాలి

విద్యార్థి, నిరుద్యోగ జేఏసీ చైర్మన్ కోటూరి మానవతారాయ్



మాట్లాడుతున్న కోటూరి మానవతారాయ్

కేయూ క్యాంపస్, ఆగస్టు 10: రాష్ట్రంలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను ఏజెన్సీ సంస్థల దోపిడీ నుంచి రక్షించి న్యాయం చేయాలని తెలంగాణ రాష్ట్ర విద్యార్థి, నిరుద్యోగ జేఏసీ చైర్మన్, టీపీసీసీ అధికార ప్రతినిధి కోటూరి మానవతారాయ్ అన్నారు. శనివారం కేయూ క్యాంపస్‌లోని స్కాలర్స్ హాస్టల్ వద్ద నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ మేడారపు సుధాకర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మానవతారాయ్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో లక్ష 45 వేల మంది అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు పనిచేస్తున్నారని తెలిపారు. వీరంతా అవుట్ సోర్సింగ్ సంస్థల చేతుల్లో మోసపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా పని చేస్తున్నప్పటికీ తక్కువ జీతాలు చెల్లిస్తూ సకాలంలో ఇవ్వడం లేదన్నారు. అవుట్ సోర్సింగ్ సంస్థలను తక్షణమే రద్దు చేసి చట్టబద్ధమైన సంస్థను ఏర్పాటు చేసి అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కాగా సీఎం రేవంత్‌రెడ్డి పాలన స్వర్ణయుగంలా ఉందన్నారు. నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్ ప్రకటించి రెండు లక్షల కొలువులను భర్తీ చేస్తున్నారని పేర్కొన్నారు. ఏకకాలంలో రైతులకు రూ.2లక్షల రూణమాఫీతో అందరూ స్వర్ణయుగం రేవంత్‌రెడ్డి పాలనను భావిస్తున్నారని అన్నారు. జీవో 29 మాజీ సీఎం కేసీఆర్ తెచ్చి ఇప్పుడు మెడికల్ సీట్ల విషయంలో టీఆర్ఎస్ డ్రామాలు చేస్తోందని దుయ్యబట్టారు. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీతో యువతకు లాభం జరుగుతోందన్నారు. ఈ సమావేశంలో నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి డాక్టర్ సురాసి కృష్ణ, కేయూ పరిశోధక విద్యార్థులు తాళ్ళపల్లి నరేశ్‌గౌడ్, గుండేటి సుమన్, వర్సిటీ నిరుద్యోగ జేఏసీ ఇన్‌చార్జి అభిరామ రమేశ్, పల్లె శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాజీపేట మీదుగా ఇండిపెండెంట్ డే స్పెషల్ రైలు

కాజీపేట, ఆగస్టు 10: ఇండిపెండెంట్ డేను పురస్కరించుకుని కాజీపేట మీదుగా(07069/07070) హైదరాబాద్ - సంత్రగాచి - హైదరాబాద్ స్పెషల్ రైలు నడిపించనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఈ రైలు ఈనెల 14, 15 తేదీల్లో నడిపించనున్నారు. ఈనెల 14, 15వ తేదీల్లో హైదరాబాద్‌లో ఉదయం 5.30 గంటలకు బయలుదేరి కాజీపేటకు 7.30 గంటలకు చేరుకుంటుంది. సికింద్రాబాద్, జనగాం, కాజీపేట జంక్షన్, వరంగల్, ఖమ్మం, విజయవాడ, ఏలూరు, రాజమండ్రి, సామర్లకోట, అన్నవరం, దువ్వాడ, పెందుర్తి, విజయనగరం, చీపురుపల్లి, శ్రీకాకుళం రోడ్, పలాస, బుర్హంపూర్, ఖుర్దా, భువనేశ్వర్, కటక్, జైపూర్, కీయోంజార్, భద్రక్, బలసోర్, కరఖ్‌పూర్ స్టేషన్‌లలో హాల్టింగ్ సౌకర్యం కల్పించినట్లు అధికారులు తెలిపారు.

25న జిల్లా స్థాయి చెస్ పోటీలు

వరంగల్ స్పోర్ట్స్, ఆగస్టు 10: రాష్ట్ర చెస్ అసోసియేషన్ సహకారంతో జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 25న హనుకొండ పబ్లిక్‌గార్డెన్ సమీపంలోని టీటీడీ కల్యాణ మండపంలో ఉమ్మడి జిల్లా స్థాయి చెస్ పోటీలను నిర్వహించనున్నట్లు నిర్వహణ కార్యదర్శి కన్న ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-9, 19 బాలబాలికల విభాగంలో వేర్వేరుగా పోటీలను నిర్వహిస్తామన్నారు. ఇక్కడ జిల్లా స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ క్రీడాకారులను సెప్టెంబర్ మొదటి వారంలో హైదరాబాద్‌లో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి చెస్ టోర్నీకి ఎంపిక చేస్తామన్నారు. వివరాలకు 9059522986 నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

స'జీవ' శిల్పం!

● కాకతీయుల నాటి కళాసంపదకు పునరుజ్జీవం ● దెబ్బతిన్న శిల్పాల అకృతితో సిమెంట్ విగ్రహాల తయారీ ● కాకతీయుల శిల్ప సౌందర్యాన్ని కాపాడే ప్రయత్నంలో చరిత్ర పరిశోధకులు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

కాకతీయుల కాలంలో నిర్మించిన ప్రతీ కట్టడం ఓ అద్భుతమే. అందులో ప్రతీ దేవాలయాల నిర్మాణానికి ఓ ప్రత్యేకత ఉంది. ఆ ప్రత్యేకతే శిల్పం. ఎన్నో ఏళ్లు శ్రమించి శిల్పులు శిలలకు జీవం పోసేలా నిర్మాణం చేశారు. అందులో రామప్ప శిల్ప సౌందర్యం యునెస్కోను కట్టి పడేసింది. తెలుగు రాష్ట్రాల్లోనే తొలిసారి రామప్పను ప్రపంచ వారసత్వ కట్టడంగా యునెస్కో గుర్తించింది. కేవలం రామప్పలోని శిల్ప నైపుణ్యతతో పాటు నీటిలో తేలియాడే ఇటుకల తయారీ యునెస్కోను మైమరిపింపజేసింది. ఆలయం చుట్టూ గోడలపై ఉన్న నాట్యకారిణులు, ఏనుగులు, మదనికల విగ్రహాలు రామప్ప ప్రత్యేకత. నల్ల గ్రానైట్ రాయిపై చెక్కిన నాగిని, మద్నిక శిల్పాలు, రంగమండప స్తంభాలు, యాలి, గజకేసరి శిల్పాలు అలనాటి కళకారుల నైపుణ్యానికి నిదర్శనంగా నిలిచి యునెస్కో గుర్తింపునకు దోహదపడ్డాయి. కాకతీయుల కాలంలో అనేక దేవాలయాల్లో ఇలాంటి శిల్ప సౌందర్యమే భక్తులను ఆకట్టుకుంటుంది. రామప్పతో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లాలో వెయ్యి స్తంభాల దేవాలయం, వరంగల్ కోట, గణపేశ్వరాలయం.. ఇలా అనేక ప్రాంతాల్లో కాకతీయుల కట్టడాలున్నాయి. వీటిలో చాలా వరకు ప్రకృతి వైపరిత్యాలతో పాటు హిందూ దేవాలయాలపై జరిగిన దాడుల్లో అనేక శిల్పాలు దెబ్బతిన్నాయి. కొన్ని శిల్పాలు వాటి అకృతిని పూర్తిగా కోల్పోయాయి. తెలంగాణ సంస్కృతి వైభవాన్ని కాపాడేందుకు చరిత్ర పరిశోధకులు టీమ్ ఆఫ్ రీసెర్చ్ ఆన్ కల్చర్ అండ్ హెరిటేజ్ (టార్చ్) అనే పేరుతో అంతరించి పోతున్న చరిత్రకు జీవం పోసేందుకు కృషి చేస్తున్నారు.

శిల్పాలకు పునరుజ్జీవం..

కాకతీయుల కాలంలో కళావైభవం ఎంత వర్ధిల్లిందో.. శిల్ప సౌందర్యం కూడా అంతే ఆకర్షించింది. అయితే కాకతీయులు నిర్మించిన అనేక అలయాల్లోని శిల్పాలు దుండగుల దండయాత్రలు, ప్రకృతి వైపరీత్యాల కారణంగా వాటి అసలు రూపాన్ని కోల్పోయాయి. చరిత్రకు మౌనసాక్ష్యాలుగా నిలిచాయి. టార్చ్ అధ్వర్యంలో కాకతీయ రాజులు పరిపాలించిప్పుడు రూపొందించిన వందకు పైగా ప్రసిద్ధ శిల్పాలను గుర్తించి వాటికి మునుపటి రూపాన్ని తీసుకొచ్చేందుకు గత ఆరు నెలలుగా ప్రయత్నాలు చేస్తున్నారు. కాకతీయ సామ్రాజ్యంలో దాదాపు 1,600 ప్రదేశాలలో అనేక దేవాలయాలు ఉన్నాయి. ఈవారసత్వ కట్టడాల్లో 4,000కుపైగా శిల్పాలున్నాయి. ఈ ప్రాజెక్టులో అరవింద్, ఈమని శివనాగిరెడ్డి (రిటైర్డ్ ఆర్కియాలజిసిస్ట్), ఏలూరి శేషబ్రహ్మం (ప్రముఖ కళాకారుడు), రఘువీర్ (స్తపతి), రక్షిత్(కళాకారుడు), హిమాన్వి(నృత్యకారిణి) దాదాపు 100పాడైపోయిన శిల్పాలను సేకరించి స్కెచింగ్ చేసి శిల్పాలను తయారు చేయడం ప్రారంభించింది. వరంగల్ కోట, రామప్ప దేవాలయం, చంద్రవల్లి దేవాలయాలు, నాగులపాడు, కూసుమంచి, ధంతేశ్వరి నుంచి అనేక విగ్రహాల నమునాలను సేకరించారు. పునరుజ్జీవ ప్రాజెక్టు కాకతీయ రాజవంశం కాలం నాటి దెబ్బతిన్న శిల్పాలను పునర్మించడం లక్ష్యంగా పెట్టుకుంది. శిల్పాలు దెబ్బతినకుండా ఉంటే ఎలా ఉంటుందో ఊహించాల్సి ఉంటుంది. ఆ కళాఖండాలను గీసి.. సిమెంట్‌లో చెక్కాల్సి ఉంటుంది. ఇలా ఇప్పటివరకు 30శిల్పాలను పూర్తి చేశారు. కాకతీయుల కాలంలో ఒక్కో శిల్పం చెక్కడానికి కనీసం ఆరు నెలల సమయం పట్టేది. కాకతీయ శిల్పాలు తమ జీవితాంతం వేలాది శిల్పాలను రూపొందించారు. కాకతీయ కట్టడాలపై జరిగిన దాడులలో ఇటువంటి అద్భుతమైన కళాఖండాలు నాశనమయ్యాయి. శిథిలావస్థకు చేరిన శిల్పాల అసలు స్వరూపంపై ఇప్పటివరకు ఎలాంటి పరిశోధనలు జరగలేదు. వీటిని ఇలా నిర్లక్ష్యం చేస్తే ఉన్నవి కూడా కనుమరుగవుతాయని చరిత్ర పరిశోధకుడు అరవింద్ ఆంధ్రజ్యోతికి తెలిపారు.

శిల్పవైభవం భవిష్యత్తు తరాలకు తెలిసేలా

చరిత్రను గుర్తు పెట్టుకోవడానికి శాసనాలు, నాణేలు, పుస్తకాలు, జానపద కథలు లాంటి రాతపూర్వక ఆధారాలు ఉంటాయి. శిల్పాల ద్వారా చరిత్రను చూపించవచ్చని, దెబ్బతిన్న శిల్పాలు అప్పట్లో ఎలా ఉండేవో.. వాటి అసలు అకృతిని ప్రజలకు చూపించాలని లక్ష్యంగా శిల్ప పునరుజ్జీవం కోసం చరిత్ర పరిశోధకులు అడుగులు వేస్తున్నారు. ఇప్పటికే అనేక ప్రాంతాల్లో కాకతీయులతో పాటు అనేక మంది రాజులు నిర్మించిన కట్టడాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. వాటి అనవాళ్లు కూడా లేకుండా పోయాయి. ఈ నేపథ్యంలో ఓరుగల్లు శిల్పావైభవాన్ని భవిష్యత్ తరాలకు అందించేలా పునరుజ్జీవ ప్రాజెక్టు ఉపయోగపడుతుందని పరిశోధకులు పేర్కొంటున్నారు. ప్రధానంగా రామప్ప, వరంగల్ కోటలోని అనేక శిల్పాలను గుర్తించారు. వీటి అసలు అకృతి ఉట్టిపడేలా సిమెంట్‌తో విగ్రహలను తయారు చేస్తారు.





ఈ శిల్పాలకే పునరుజ్జీవం..

కాకతీయుల కాలంలో నిర్మించిన విగ్రహాలు అనేకం ధ్వంసమయ్యాయి. వీటిలో కొన్నింటి అసలు అకృతితో పునరుజ్జీవం కల్పించేందుకు టార్చ్ బృందం ఎంపిక చేసింది. వీటిలో రామప్ప ఆలయంలో వందలాది నృత్య శిల్పాలు న్నాయి. పేరిణి, కోలాటంతో పాటు ఇతర శిల్పాలు, నాలుగు కాళ్లతో శివప్రియ నృత్య భంగిమ ఉంది. రంగమండపానికి ఆగ్నేయం వైపు చెక్కిన ఈ శిల్పంలో ముగ్గురు మహిళలు నాలుగు కాళ్లతో నాట్యం చేస్తున్నారు. ఈ శిల్పానికి పునరుజ్జీవం కల్పిస్తున్నారు. అలాగే రామప్ప ఆలయంలోని రంగ మంటపంపైన ఉన్న కపాలి రాతిపై మధ్యలో నటరాజ, అష్ట దిక్పాలకులతో కూడిన కళాకృతి ఉంది. దీన్ని కూడా పునరుజ్జీవం కల్పించనున్నారు. వరంగల్ కోటలోని శంభు దేవాలయంలో అరుదైన ముఖలింగంతో ఉంది. నాలుగు దిక్కులకు నాలుగు ముఖాలు చెక్కి ఉంటుంది. వారిని సద్యోజాత, వామదేవ, అఘోర, ఈశాన అని పిలుస్తారు. ఈ లింగాన్ని కూడా నమునా తయారు చేస్తున్నారు. పాలంపేటలోని రామప్ప చెరువు కట్టపై ఉన్న త్రికూట ఆలయ ధ్వజస్థంభం కాల క్రమేణా అరిగిపోయింది. దీనికి కూడా పునరుజ్జీవం తేనున్నారు. వీటితో పాటు 100 శిల్పాలకు జీవం పోయనున్నారు.



శిల్పాలను తయారుచేస్తున్న స్తపతి రఘువీర్



కాకతీయ శిల్ప వైభవాన్ని కాపాడేందుకే..

అరవింద్, టార్చ్, ప్రధాన కార్యదర్శి

కాకతీయుల కాలంలో నిర్మించిన శిల్పాలను పునఃనిర్మించటంతో పాటు సాంస్కృతిక వైభవం, వారసత్వం, కళలను కాపాడేందుకు శిల్పాల పునరుజ్జీవ ప్రక్రియను చేపట్టాం. వారసత్వ కట్టడాల్లో దెబ్బతిన్న 100 శిల్పాలను గుర్తించాం. వీటిలో 30కి పైగా శిల్పాలను పునరుద్ధరించాం. వరంగల్, హైదరాబాద్ నగరాల్లో ఈ శిల్పాలను ప్రదర్శనకు ఉంచుతాం. ఛత్తీస్‌గఢ్, జగదల్‌పూర్‌లోని కాకతీయుల వారసుడు కమల్‌చంద్ర భంజ్‌దేవ్ రాజ్‌మహల్‌లో ప్రదర్శించనున్నాం. ఈ మహల్‌ను త్వరలోనే మ్యూజియంగా మార్చి భవిషత్ తరాలకు కాకతీయుల శిల్ప వైభవం, చరిత్రను అందేలా చూస్తున్నాం.





యథావిధిగా నడుస్తున్న రైళ్లు

శాతవాహన, గోల్కొండ, కృష్ణా, పుష్‌పుల్‌తో సహా అన్నీ రన్నింగ్

ఈ నెల 5 నుంచి పోయిన రైళ్ల పునరుద్ధరణ

గిర్మాజీపేట, ఆగస్టు 10: విజయవాడ రైల్వేస్టేషన్- విజయవాడ పశ్చిమ క్యాబిన్ మధ్య కొనసాగుతున్న మూడోలైన్ పనుల కారణంగా ఈనెల 5 నుంచి నిలిచిపోయిన శాతవాహన, గోల్కొండ, కాజీపేట- డోర్నకల్- విజయవాడ పుష్‌పుల్ రైళ్లతో సహా వరంగల్ రాకుండా దారి మళ్లించిన పలు రైళ్లు శనివారం నుంచి యథావిధిగా నడుస్తున్నాయి. సికింద్రాబాద్- విజయవాడ -సికింద్రాబాద్ శాతవాహన ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్- గుంటూరు -సికింద్రాబాద్ గోల్కొండ ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్ - గుంటూరు- సికింద్రాబాద్ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌లు, కాజీపేట- డోర్నకల్- విజయవాడ, విజయవాడ- డోర్నకల్ - కాజీపేట పుష్‌పుల్ రైళ్లు యథావిధిగా రాకపోకలు సాగుతున్నాయి. వరంగల్ రాకుండా దారిమళ్లించిన ఆదిలాబాద్ -తిరుపతి -ఆదిలాబాద్ కృష్ణా ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్-తిరుపతి - సికింద్రాబాద్ పద్మావతి, హైదరాబాద్ -చెన్నై సెంట్రల్- హైదరాబాద్ చార్మినార్ ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్ -గూడూరు -సికింద్రాబాద్ సింహపురి ఎక్స్‌ప్రెస్ తదితర రైళ్లన్నీ శనివారం నుంచి వరంగల్ మీదుగా రాకపోకలు తిరిగి ప్రారంభమయ్యాయి. శనివారం ఉదయం తిరుపతి నుంచి ఆదిలాబాద్ బయలుదేరిన కృష్ణా ఎక్స్‌ప్రెస్ విజయవాడ, ఖమ్మం మీదుగా సాయంత్రం 6.10గంటలకు వరంగల్‌కు చేరుకుని ఆదిలాబాద్‌కు బయలుదేరింది. దీంతో 5 రోజుల పాటు విజయవాడ, హైదరాబాద్ వైపు రైళ్ల రాకపోకలు లేక తీవ్ర ఇబ్బందులు పడ్డ ప్రయాణికులకు ఊరట లభించింది.

సంగెం పీహెచ్‌సీలో అయోమయానికి తెర

ఒకరిని బదిలీ చేస్తూ ఉత్తర్వులు

వరంగల్ మెడికల్, ఆగస్టు 10: వరంగల్ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖలో ఒకే పోస్టులో ఇద్దరిని కేటాయిస్తూ వెలువడిన ఉత్తర్వులను రద్దు చేశారు. వైద్య, ఆరోగ్యశాఖలో అయోమయం అనే కథనం ఈ నెల 8న ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురితమైంది. వరంగల్ జిల్లా సంగెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సూపర్‌వైజర్‌గా ఎం.హనుమనాయక్‌ను నియమిస్తున్నట్లు రాష్ట్ర ప్రజారోగ్య సంచాలకులు ఉత్తర్వులు విడుదల చేశారు. మరో పది రోజులకు ఇదే స్థానంలో సదానందంను నియమిస్తున్నట్లు ఆదేశాలు వెలువడ్డాయి. ఈ విషయాన్ని ఆంధ్రజ్యోతి వెలుగులోకి తీసుకురాగా సదానందంను గీసుగొండకు బదిలీ చేసినట్లు తాజా ఉత్తర్వులు విడుదల చేశారు.

బాలయేసులో స్పోర్ట్స్‌మీట్ డే



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఉపాధ్యాయులు

దేవరుప్పుల, ఆగస్టు 10: మండలకేంద్రంలోని బాలయేసు పాఠశాలలో శనివారం స్పోర్ట్స్‌మీట్ డే ను ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులకు వివిధ విభాగాల్లో ఆటల పోటీలు నిర్వహించారు. బ్లూ, ఎల్లో, గ్రీన్, బ్రౌన్ హౌజ్‌లుగా ఏర్పాటు చేసి వాలీబాల్, ఖోఖో, త్రోబాల్, షటిల్, క్రికెట్ పోటీలను నిర్వహించారు. సీనియర్ క్రికెట్ పోటీల్లో ఎల్లో హౌజ్ విద్యార్థులు విజయం సాధించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ బ్రదర్ జేసురాజ్, పీఈటీ కృష్ణ, ఉపాధ్యాయులు మాధవి, అనిత, ఖాజా, మదన్‌మోహన్, మహేష్, పాషా, మహేందర్, రాజశేఖర్ పాల్గొన్నారు.

ప్రతీ సోమవారం 'ప్రజావాణి'

బచ్చన్నపేట, ఆగస్టు 10: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఇకనుంచి ప్రతీ సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తామని నాయబ్ తహసీల్దార్ ఫణి కిశోర్ తెలిపారు. ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించటంతో పాటు తమ పరిధిలోని సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో ఆరోగ్య మేళా



బచ్చన్నపేట ఆస్పత్రిలో వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్లు

బచ్చన్నపేట, ఆగస్టు 10: స్థానిక ప్రభుత్వాస్పత్రిలో శనివారం ఆరోగ్య మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతీ నెల రెండో శనివారం ఆయుష్మాన్ ఆరోగ్య మేళాను నిర్వహిస్తామని, మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా బాధితులకు వైద్య పరీక్షలు చేసి మందులు ఇచ్చారు. కార్యక్రమంలో వైద్యులు సుప్రజ, దీప్తి, సిద్ధి సుదర్శన్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

బచ్చన్నపేట, ఆగస్టు 10: మండలంలోని తమ్మడపల్లి గ్రామంలో మక్కాల కనకవ్వ అనే మహిళ మృతి చెందగా, ఆమె కుటుంబ సభ్యులను కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు జంగిటి విద్యానాథ్ శనివారం పరామర్శించి ఆర్థిక సహాయం అందించారు. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ తరుపున నగదు అందించారు.

బాసర ట్రిపుల్ ఐటీలో సీటు వచ్చిన పేద విద్యార్థికి శనివారం సామాజిక సేవకుడు కోడూరు శివకుమార్‌గౌడ్ రూ.5 వేలు అందించారు. కొన్నె గ్రామానికి చెందిన మల్ల శ్రీవాణి-కుమార్ దంపతుల కుమారుడు మల్ల వరుణ్ గత పదవ తరగతి పరీక్షల్లో మండల టాపర్‌గా నిలిచి ట్రిపుల్ ఐటీలో సీటు సంపాదించినందున సాయం అందించారు.

ప్రతి ఇంటా జాతీయ జెండా ఎగరాలి

దేవరుప్పుల, ఆగస్టు 10: ఈనెల 13నుంచి 15వరకు ప్రతీ ఇంటా మూడు రంగుల జెండాను ఎగురవేయాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు దుబ్బ రాజశేఖర్ పిలుపునిచ్చారు. హర్ ఘర్ తిరంగా అభియాన్ కార్యక్రమంలో భాగంగా శనివారం మండలకేంద్రంలోని స్వాతంత్ర్య సమరయోధుడు మర్రి పాపిరెడ్డి స్మారక విగ్రహానికి వారు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు ప్రతీ ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలని, రెపరెపలాడుతున్న మువ్వన్నెల జెండా గర్వాన్ని ప్రపంచానికి చాటి చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి చింత సృజన్‌కుమార్, జిల్లా నాయకులు పెదగోని రాజు, మండల అధ్యక్షుడు కాసాని సత్తయ్య, మండల ఉపాధ్యక్షుడు గణేష్, బీజేవైఎం జిల్లా అధికార ప్రతినిధి సంగి రాజు, మండల నాయకులు భాస్కర్, గిరిజన మోర్చా మండల అధ్యక్షుడు అన్వేష్, నాయకులు భిక్షపతి, రమేష్, పాషా తదితరులు పాల్గొన్నారు.



దేవరుప్పులలో స్వాతంత్ర్య సమరయోధుడు మర్రి పాపిరెడ్డి విగ్రహానికి పూలమాల వేస్తున్న బీజేపీ నాయకులు

పాలకుర్తి: స్వాతంత్ర్య దినోత్సవం రోజున ఇంటింటా తిరంగా జెండా ఎగరాలని భారతీయ జనతా పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు దుబ్బ రాజశేఖర్ గౌడ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ సూచన మేరకు ఇంటింటా జాతీయ జెండాలను ఎగురేయాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు దుంపల సంపత్, మారం రవి, వేల్పుల దేవరాజ్, సోమేశ్వర్, శీను, రాజు, సురేష్, నాయకులు ఉపేందర్‌రెడ్డి, రాణాప్రతాప్, మహేష్ పాల్గొన్నారు.

కొడకండ్ల: ఈనెల 15న ప్రతీ ఇంటిపై జాతీయ జెండా ఎగరాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు దొంగరి మహేందర్ అన్నారు. మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శనివారం పార్టీ మండల అధ్యక్షుడు పులిగిల్ల ఉపేందర్ అధ్యక్షతన హర్‌ఘర్ తిరంగాయాత్ర కార్యక్రమంపై మండల స్థాయి నాయకులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 76 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా ప్రధాని మోదీ ఆదేశాల మేరకు ఈ నెల 13 నుంచి 15వ తేదీ వరకు ఇంటింటికీ తిరిగి ప్రతీ ఇంటిపై జాతీయ జెండా ఎగురవేసుకునేలా ప్రజలను చైతన్యపరచాలని కోరారు. ఈ సమావేశంలో కోటేశ్వర్, సోమన్న, శ్రీనివాస్, వెంకన్న, పరమేశ్, ఉమేశ్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నూతన జీపీల ఆమోదంపై హర్షం

మాజీ మంత్రి ఎర్రబెల్లిని సన్మానించిన గిరిజనులు

పాలకుర్తి, ఆగస్టు 10: మండలంలోని దుబ్బతండా, మేకల తండాలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపినందున గిరిజనులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ మంత్రి దయాకర్‌రావు బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో పంపిన ప్రతిపాదనకు నేడు ఆమోదం లభించిందన్నారు. ఈ మేరకు శనివారం రెండు తండాల నాయకులు దయాకర్‌రావును ఘనంగా సన్మానించారు. అనంతరం దయాకర్‌రావు మాట్లాడుతూ గిరిజన తండాలు గ్రామాలుగా ఏర్పడితే అభివృద్ధి చెందుతాయని అన్నారు. మా తండాలో మారాజ్యం అనే నినాదంగా మిగిలిపోకుండా మాజీ సీఎం కేసీఆర్ రాష్ట్రంలోని తండాలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేశారని అన్నారు. కాగా, మరికొన్ని తండాలను పంచాయతీల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపామని వాటిని పరిశీలించి ఆమోదం తెలిపే విధంగా చర్యలు తీసుకోవాలని గిరిజనులు ఎర్రబెల్లిని కోరారు. కార్యక్రమంలో నాయకులు నవీన్, నాగిరెడ్డి, వాసూనాయక్, గణేష్, యాకూబ్, పుస్కూరి శ్రీనివాసరావు, రవి, మల్లేష్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను పరామర్శ..

పాలకుర్తి మండలం గూడూరు, విస్నూరు, చెన్నూరు గ్రామాల్లో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన కుటుంబాలను మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని అన్నారు. ఆయన వెంట నాయకులు నవీన్, మాజీ ఎంపీపీ నాగిరెడ్డి, నక్క నాగన్న, మాజీ ఎంపీటీసీ మాటూరి యాకయ్య, కారుపోతుల వేణు, చిక్కుడు రాములు, ఎండి. అబ్బాస్ అలీ, కలింగరావు పాల్గొన్నారు.



పాలకుర్తిలో మాజీ మంత్రి దయాకర్‌రావును సన్మానిస్తున్న గిరిజన నాయకులు

గీత కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

కేజీకెఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటమల్లయ్య

స్టేషన్‌ఘన్‌పూర్, ఆగస్టు10: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు కల్లుగీత కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాల్నె వెంకటమల్లయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం స్టేషన్‌ఘన్‌పూర్ మండలం శివునిపల్లిలో కల్లుగీత కార్మిక సంఘం మండల అధ్యక్షులు మాచర్ల రఘురాములు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కల్లుగీత కార్మికుల హక్కుల కోసం పోరాడి అమరులైన వారిని యాది చేసుకుంటూ ఆగస్టు 2న బొలగాని పుల్లయ్య 36వ వర్ధంతి నుంచి ఆగస్టు 18 సర్దార్ సర్వాయి పాపన్న 374వ జయంతి వరకు అమరుల యాదిలో గీతన్నల చైతన్య యాత్రను అన్ని జిల్లాల్లో చేపడుతున్నామన్నారు. ఈ సందర్భంగా హ్రరాస్ మామ్లాకు వ్యతిరేకంగా పోరాటం చేసి సొసైటీల ఏర్పాటు, నౌకర్ నామాలాంటి చట్టాలను రద్దుచేయించడం, ఎక్స్‌గ్రేషియా, చెట్లపెంపకానికి భూమి, పెన్షన్‌లాంటి హక్కులను సాధించిన ఘనత కల్లుగీత కార్మిక సంఘానికే దక్కుతుందన్నారు. అనేక పోరాటాలకు నాయకత్వం వహించిన ధర్మభిక్షం, ఎస్ఆర్ దాట్ల, తొట్ల మల్సూర్, బైరు మల్లయ్య, దేశిని చిన్న మల్లయ్య, వర్ధెల్లి బుచ్చిరాములు, పెరుమాళ్ల జగన్నాథం, బొలగాని పుల్లయ్య, ఘనగాని గౌరయ్య, దూడల నర్సయ్య, అంబటి సత్యనారాయణ లాంటి ఎందరో అమరవీరులు నేటి యువతరానికి స్ఫూర్తి దాయకమన్నారు. వాళ్ల స్ఫూర్తితో హక్కుల సాధన కోసం నడుంబిగించాలని సూచించారు. కార్మికులకు సేఫ్టీ మోకులను అందజేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు కుర్ర ఉప్పలయ్య మాట్లాడుతూ తాటి, ఈత చెట్లను నరికిన వారిపై కఠినచర్యలు తీసుకోవడానికి కొత్త చట్టాన్ని రూపొందించాలని కోరారు. కార్యక్రమంలో కంకటి రాజయ్య, సట్ల రాజు, వంగ శ్రీనివాస్, పులి స్వామి, తిరుపతి, సత్యనారాయణ, ఎల్లగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బాల్నె వెంకటమల్లయ్య

ఎరువుల దుకాణంలో చోరీ



ఫింగర్ ప్రింట్స్‌ను కలెక్ట్ చేస్తున్న క్లూస్ టీం

దేవరుప్పుల, ఆగస్టు 10: సింగరాజుపల్లి చౌరస్తాలో గల శ్రీ మల్లికార్జున ఎరువుల దుకాణంలో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. దుండగులు షాప్ వెనుక వైపునుంచి డోర్ పగులగొట్టి, కౌంటర్ ధ్వంసం చేసి రూ.20వేల నగదు అపహరించారు. అంతే కాకుండా షాపులో ఉన్న రెండు సీసీ కెమెరాలు, రూటర్‌ను వెంట తీసుకెళ్లారు. షాపు యజమాని చిర్ర రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సృజన్‌కుమార్ తెలిపారు. సంఘటనా స్థలానికి క్లూస్ టీంను రప్పించగా వారు క్లూస్, ఫింగర్ ప్రింట్స్‌ను కలెక్ట్ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఫింగర్‌ప్రింట్ల ఆధారంగా త్వరలో దొంగలను పట్టుకుంటామని అన్నారు.

డ్రైవర్, కండక్టర్‌పై చర్య తీసుకోవాలి

ఐజేయూ జిల్లా అధ్యక్షుడు మల్లారెడ్డి



జనగామలో అసిస్టెంట్ డిపో మేనేజర్‌కు వినతి పత్రం అందిస్తున్న జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు

జనగామ రూరల్, ఆగస్టు 10 : జర్నలిస్టులపై దాడికి పాల్పడిన ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని ఇండియన్ జర్నలిస్టు యూనియన్ (ఐజేయు) జిల్లా అధ్యక్షుడు ఇర్రి మల్లారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జర్నలిస్టులపై దాడి ఘటనను నిరసిస్తూ శనివారం జనగామ ఆర్టీసీ డిపో ఎదుట జర్నలిస్టులు ఆందోళన చేపట్టి, అసిస్టెంట్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టుల సేవలను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం తమకు ఉచిత బస్ ప్రయాణ సౌకర్యం కల్పించిందన్నారు. అయితే ఆత్మహత్య చేసుకున్న జర్నలిస్టు యోగి అంత్యక్రియలకు హాజరయ్యేందుకు జర్నలిస్టులు వెంకటరత్నం, వినయ్ జనగామకు వచ్చేందుకు హన్మకొండ బస్టాండులో పాసు చూపించి బస్సు ఎక్కేందుకు యత్నించగా, వారిపై డ్రైవర్, కండక్టర్ దుర్భాషలాడారని మండిపడ్డారు. అవహేళన చేస్తూ అమానుషంగా ప్రవర్తించిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధులు, జర్నలిస్టులు భిక్షపతి, వెంకటస్వామి, ఉపెందర్, సంతోష్, యూసుఫ్, నరేందర్, శ్రీకాంత్, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి



కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కి వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

చిలుపూర్, ఆగస్టు 10 : మండలంలో నెలకొన్న ప్రధాన సమస్యల పరిష్కారంపై చొరవ చూపాలని కోరుతూ కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ కుమార్‌ను బీజేపీ మండలాధ్యక్షుడు గంటె ఉపేందర్ యాదవ్ కోరారు. ఈ మేరకు శనివారం మాజీ మంత్రి డాక్టర్ గుండె విజయ రామారావు (జీవీఆర్) నేతృత్వంలో హైదరాబాద్‌లో మంత్రి సంజయ్‌ని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్ళారు. మండలంలోని చిన్నపెండ్యాలలో హైవేపై ఫుట్ ఓవర్ బ్రిడ్జీ, నష్కల్ ఆకేరువాగుపై బ్రిడ్జి నిర్మాణం, పోలీస్‌స్టేషన్ భవనం నిర్మించాలని, అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు అయిలోని అంజిరెడ్డి, రమణ, రాజుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ స్వర్ణోత్సవాలు



జెండాను ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

జనగామ రూరల్, ఆగస్టు 10: ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ స్థాపించి 50 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శనివారం జిల్లా కేంద్రంలోని టీయస్ యూటీఎఫ్ కార్యాలయంలో వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ మాట్లాడుతూ ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం 1974లో యూటీఎఫ్ ఆవిర్భవించిందన్నారు. కార్యక్రమంలో ఆకుల శ్రీనివాస్‌రావు, కృష్ణమూర్తి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

జర్నలిస్టు యోగిరెడ్డి మరణం బాధాకరం

జనగామ రూరల్, ఆగస్టు 10: యోగిరెడ్డి మరణించడం చాలా బాధాకరమని వరంగల్ ఎంపీ కడియం కావ్య అన్నారు. జర్నలిస్టు యోగిరెడ్డి శుక్రవారం హన్మకొండలో కూతురు ఆద్యరెడ్డిని ఉరివేసి చంపి తాను కూడా ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. శనివారం హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో జర్నలిస్టులు నివాళులర్పించిన అనంతరం మృతదేహాన్ని జనగామకు తరలించారు. జిల్లా కేంద్రంలోని గీతానగర్‌లో యోగిరెడ్డి అంత్యక్రియలు నిర్వహించారు. వరంగల్ ఎంపీ కడియం కావ్య, బీఆర్‌ఎస్ నాయకుడు ఏనుగుల రాకేష్ రెడ్డి యోగిరెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను ఓదార్చి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ప్రశ్నించే గొంతుక యోగిరెడ్డి మరణించడం చాలా బాధాకరమన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున జర్నలిస్టులు తరలివచ్చి యోగి అంత్యక్రియల్లో పాల్గొని కన్నీరుమున్నీరయ్యారు. ప్రేమతో పలకరించే యోగిరెడ్డి అకాల మరణం జర్నలిస్టులకు తీరని లోటు అన్నారు.



అంత్యక్రియల్లో పాల్గొన్న ఎంపీ కడియం కావ్య

ఆదమరిస్తే అంతే సంగతులు

ప్రమాదకరంగా మూలమలుపులు ● భయాందోళనలో ప్రజలు



ఇప్పగూడెం నుంచి అక్కపల్లిగూడెం వెళ్లే రోడ్డుపై ప్రమాదకరంగా ఉన్న మూలమలుపులు

స్టేషన్‌ఘన్‌పూర్, ఆగస్టు 10: మండలంలోని ఇప్పగూడెం నుంచి అక్కపల్లిగూడెం వెళ్లే రోడ్డు మూలమలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. ఇరువైపులా చెట్లపొదలు దట్టంగా పెరిగి ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక అనేక రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో ఈ రోడ్డు మీదుగా వెళ్లేందుకు ప్రయాణికులు జంకుతున్నారు. మూలమలుపు దాటే వరకు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని ముందుకు వెళ్లుతున్నారు. నిత్యం అక్కపల్లిగూడెం మీదుగా కంచనపల్లి, శివాజీనగర్ మీదుగా రఘునాథపల్లికి అనేక మంది ద్విచక్రవాహనాలు, ఆటోలలో వెళ్లుతుంటారు. అయితే రోడ్డుకు ఇరువైపులా చెట్లు పెరిగి రోడ్డు పైకి వచ్చాయి. దీంతో రోడ్డు పూర్తిగా ఇరుకుగా మారడంతో తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయి. మండల ప్రజలు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించక రెండు మూడు పర్యాయాలు ఆటోలు, ద్విచక్రవాహనాలు ఢీకొని స్వల్ప గాయాలతో ప్రయాణికులు బయటపడ్డారని గ్రామస్తులు చెబుతున్నారు. వారం రోజుల క్రితం గ్రామానికి చెందిన కడుదుల రత్నాకర్ ఎదురుగా వచ్చే ఆటోను ఢీకొనడంతో గాయపడ్డాడు. ఇప్పగూడెం గ్రామానికి చెందిన మేకల కల్యాణ్ ఎదురుగా వచ్చే బైక్‌ను ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. సుమారు రెండు కిలోమీటర్ల దూరం మేర మూలమలుపు రోడ్డుకు ఇరువైపుల చెట్లు పెరిగాయి. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి రోడ్డుకు ఇరువైపులా ఉన్నటువంటి చెట్లను తొలగించాలని మండల ప్రజలు కోరుతున్నారు. అంతేగాకుండా మూలమలుపుల వద్ద రోడ్డు ప్రమాదాలు జరుగకుండా హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

రాత్రి వేళల్లో ఇబ్బందులు..

రాత్రి వేళల్లో సైకిళ్ల పైన, నడుచుకుంటూ వ్యవసాయ బావుల వద్దకు వెళ్లే రైతులు మూలమలుపుల వద్ద బిక్కు బిక్కుమనుకుంటు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని వెళ్లుతున్నారు. ఈ విషయమై ఇప్పటికే అనేక మార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా చెట్లను తొలగించడం లేదని గ్రామస్తులు చెబుతున్నారు. అక్కరకు రాని ప్రదేశాల్లో ప్రజాధనం వెచ్చించి చెట్లను తొలగిస్తున్నారు కాని ప్రమాదకరంగా మారిన ముళ్ల పొదలను తొలగించడానికి అధికారులు ససేమిరా అంటున్నారని మండిపడుతున్నారు. కనీసం ఉపాధిహామీ పథకంలోనైనా రహదారికి ఇరువైపులా ఉన్న మొక్కలను తొలగించే విధంగా కూలీలకు పనులు కల్పించిన బాగుండేదని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి చెట్లను తొలగించి ప్రయాణికులకు ఇబ్బందులు కల్గకుండా చూడాలని వాహనదారులు వేడుకుంటున్నారు.

ఇబ్బందికరంగా ఉంది..

అనుముల నాగరాజు, అక్కపలిగూడెం



రోడ్డు మీదుగా ప్రయాణించాలంటే ఇబ్బందిగా ఉంది. మూల మలుపులు ప్రమాదకరంగా ఉండడంతో ఎదురుగా వచ్చే వాహనాలు సమీపంలోకి వచ్చే వరకు కనిపించని దుస్థితి నెలకొంది. ప్రమాదాలు జరిగినప్పుడే స్పందించకుండా ముందుగానే మేలుకొని చెట్లను తొలగించి ప్రమాదాలను నివారించాలి.

కోతుల బాధ తప్పేదెలా?

పిల్లలను, పెద్దలను హడలెత్తిస్తున్న వానరాలు

కొడకండ్ల ఆగస్టు 10: మండలంలో రోజురోజుకూ కోతుల సంచారం ఎక్కువవుతోంది. మనుషుల వద్ద ఆహార పదార్థాలు లాక్కోవటం, ఇండ్లలోకి జొరబడి మరీ ఆహార పదార్థాలను ఎత్తుకెళ్లడం, పిల్లలపై దాడి చేయడం సాధారణమైపోయాయి. గ్రామాల్లో గుంపులుగుంపులుగా కలియ తిరుగుతూ కూరగాయల తోటలను, పండ్ల తోటలను నాశనం చేస్తున్నాయి. పదేళ్లక్రితం హైదరాబాద్ లాంటి ప్రాంతాల నుంచి లారీల్లో పట్టుకొచ్చి మండలంలోని వివిధ గ్రామాల్లో వదిలిపెట్టగా ప్రస్తుతం అవి వందల నుంచి వేల సంఖ్యలోకి పెరిగాయి. మండలంలో 10 సంవత్సరాలకు ముందు ఈ కోతుల సమస్య లేదు. ఇతర ప్రాంతాల నుంచి తెచ్చి రాత్రివేళల్లో ఇక్కడ వదిలి వేయడంతో సమస్య ఇంత తీవ్రమయ్యింది. సమస్య ఎంత తీవ్రంగా ఉందంటే మధ్యాహ్న సమయంలో పాఠశాలలకు చేరుకుని భోజనం చేస్తున్న విద్యార్థుల వద్ద నుంచి భోజనం లాక్కున్న ఘటనలు, కూలీల టిఫిన్ బాక్స్‌లు ఎత్తుకెళ్ళిన ఘటనలు తరుచూ జరుగుతున్నాయి.

పట్టణాలతో పోలిస్తే పల్లెల్లోని ప్రతీ ఇంటి ప్రాంగణంలో కూరగాయలు వేయటం అనాదిగా వస్తోంది. అయితే కోతుల దెబ్బకు అలాంటి అవకాశమే లేకుండా పోతోంది. ఇంట్లో ఖాళీ స్థలం, నీటివసతి ఉన్నా కూడా కూరగాయ మొక్కలు నాటుకోవడానికి ఎవరూ ఆసక్తి చూపడం లేదు. గతంలో వర్షాకాలం ప్రారంభమైందంటే ప్రతీ ఇంట్లో బీర, సోర, దొండ, టమాట లాంటి వివిధ విత్తనాలను పెరట్లో నాటుకునేవారు. దాంతో బయట మార్కెట్లో కూరగాయల ధర కూడా అందుబాటులో ఉండేవి. గత పదేళ్ళుగా కూరగాయలు వేయటమేమో గానీ కోతులకు భయపడి ఇంట్లో చింత చెట్లు ఉన్నా కొట్టేయిస్తున్నారు.



కొడకండ్లలో గుంపులు గుంపులుగా తిరుగుతున్న కోతులు

ప్రస్తుతం రైతులు ఏదైనా పంట వేయాలంటే నీటి లభ్యత, భూసారంలాంటి వాటి కన్నా కోతులు తినని, నాశనం చేయని పంటలు మాత్రమే వేయడానికి ప్రయత్నిస్తున్నారు. మొక్కజొన్న, జొన్న, కందగడ్డ, కూరగాయలు, పండ్లతోటలు లాంటి పంటలు వేస్తే 24 గంటలు కాపలా ఉండాల్సి వస్తోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు కోతులను పట్టుకుని అటవీప్రాంతాల్లో వదిలి తమ కష్టాలు తీర్చాలని ముఖ్యంగా రైతులు కోరుతున్నారు.

రైతులు పండ్ల చెట్లను పెంచాలి

కుందూరు విజయ్ రెడ్డి, ఏవో, కొడకండ్ల



ప్రత్యేకంగా కోతులు, అడవి పందుల బెడదతో మాత్రమే మండలంలో దాదాపుగా 20 నుంచి 30 శాతం వరకు పంటలు నాశనమవుతున్న మాట వాస్తవం. కోతులు ముఖ్యంగా వేరుశనగ, మొక్కజొన్న, జొన్న, కూరగాయలు, పండ్ల తోటలపై దాడి చేసి ధ్వంసం చేస్తున్నాయి. నివారణ చర్యగా ప్రభుత్వం వనమహోత్సవంలో పండ్ల మొక్కలు నాటాలని చెపుతోంది. తద్వారా కోతులకు ఫుడ్ కోర్టులను ఏర్పాటు చేసినట్లైతే ఫలితం ఉంటుంది. అందుకే అందరూ పండ్ల మొక్కలను పెంచాలి.

ప్రహరీ లేక 20 ఏళ్లు

- కనీస వసతులు కల్పించక విద్యార్థుల ఇబ్బందులు
- అధ్వాన స్థితిలో నర్మెట ప్రభుత్వ జూనియర్ కళాశాల

నర్మెట, ఆగస్టు 10: మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మౌలిక వసతులు కరువయ్యాయి. 2001 సంవత్సరంలో మండలకేంద్రానికి ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూరైంది. మూడు సంవత్సరాలు ఉన్నత పాఠశాలలో కొనసాగించారు. తర్వాత ప్రత్యేక భవనం నిర్మించి 2004 సంవత్సరం నుంచి కళాశాలను అందులో కొనసాగిస్తున్నారు. కాని అందులో మౌలిక వసతులు కరువయ్యాయి. ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ కళాశాలల్లో అన్ని వసతులు కల్పిస్తున్నట్లు ప్రభుత్వాలు ప్రచారం చేస్తున్నా ఇక్కడ పరిస్థితి భిన్నంగా ఉంది. కళాశాలలో సుమారు 160 మందికి పైగానే విద్యార్థులు ఉన్నారు. అధ్యాపకులు, సిబ్బంది కలిపి 15 మంది ఉన్నారు. కళాశాలలో కనీస వసతులు లేకపోవడంతో విద్యార్థులతో పాటు అధ్యాపకులు ఇబ్బందిపడుతున్నారు. మూత్రశాలలు, మరుగుదొడ్లు, తాగునీటి వసతి కూడా లేదు. గతంలో కళాశాలలో ఉన్న వాటర్‌ప్లాంటు తుప్పు పట్టిపోయింది. కళాశాల భవనం నిర్మించి ఇరవై ఏళ్లు పూర్తైనా ఇప్పటివరకు ప్రహరీ లేదు. దీంతో సెలవు రోజుల్లో కళాశాల ఆవరణ మందు బాబులకు అడ్డాగా మారుతోంది. కళాశాల పక్కనే పంట పొలాలు ఉండడంతో విష పురుగులు సంచరిస్తున్నాయి. కళాశాల చుట్టూ ప్రహరీ నిర్మించి కనీస వసతులు కల్పించాలని విద్యార్థులు, అధ్యాపకులు కోరుతున్నారు.



ప్రహరీ లేకుండా నిర్మించిన నర్మెట జూనియర్ కళాశాల భవనం

సమస్యను పైఅధికారులకు తెలియజేస్తా: గాదె మల్లేష్, ప్రిన్సిపాల్

కళాశాలలో నేను జాయిన్ అయి మూడు రోజులే అవుతోంది. ఇక్కడ కనీస వసతులు తక్కువగా ఉన్నాయి. ప్రహరీ గోడ లేదు. కళాశాల సమస్యలను పై అధికారుల దృష్టికి తీసుకువెళ్తా. కళాశాలకు ప్రహరీ నిర్మిస్తే రక్షణగా ఉంటుంది.